## క్లుప్తంగా

### 15న గోష్పాదేశ్వరస్వామి వార్షికోత్సవం

కొవ్వూరు: స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో గోష్పాదేశ్వరస్వామి ఆలయాన్ని పునః నిర్మించి 14 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 15 నుంచి వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు.తొలి రోజైన 15న స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించనున్నట్టు తెలిపారు.వార్షికోత్సవం సందర్భంగా స్వామికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

### ముగిసిన అవధూత అమ్మ పుణ్యారాధన ఉత్సవాలు



చివటంలో అవధూత అమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉండ్రాజవరం: చివటం గ్రామంలోని చివటం అవధూత అమ్మ 43వ పుణ్యారాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన గురువారం తెల్లవారుజామున నగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం సాధు అమ్మవారికి అభిషేకాలు, విశేష పుష్పార్చన, గీతా పారాయణ నిర్వహించారు. అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం మధ్యాహ్నం, రాత్రి అన్నసమారాధన చేశారు. ఈ వేడుకల్లో సుమారు ఐదు వేల మంది భక్తులు పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందారు.

### వీఆర్వోల సంఘాధ్యక్షుడిగా శామ్యూల్



వీఆర్వోల సంఘ ఎన్నికల్లో పాల్గొన్న వీఆర్వోలు

నల్లజర్ల: వీఆర్వోల సంఘ మండల శాఖ అధ్యక్షుడిగా జె.శామ్యూల్ ఎంపికయ్యారు. వీఆర్వోల సంఘం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో జరిగింది. మండల శాఖ ఉపాధ్యక్షురాలుగా ఎస్.రాజేశ్వరి, కార్యదర్శిగా టి. శ్రీదేవి, కోశాధికారిగా ఎం.మాధవి, అసోసియేట్ కార్యదర్శిగా కె.శ్రీనివాస రావు, గౌరవాధ్యక్షుడిగా ఆర్.లక్ష్మణమూర్తి ఎన్నికయ్యారు.

### ఉచిత దంత వైద్య శిబిరం

నిడదవోలు: స్థానిక లింగంపల్లి రోటరీ సెంట్రల్ వృద్ధాశ్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ శాఖ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 25 మంది వృద్ధులకు డాక్టర్ వీఎస్ఆర్ ప్రసాద్ దంత పరీక్షలు చేశారు. శిబిరంలో ఇంజే శేఖర్, బూరుగుపల్లి సత్యనారాయణ, నీరుకొండ సుబ్రహ్మణ్యం, మాచర్ల మధుసూదన రావు, కార్యదర్శి రాజా, ఈదల నాగేశ్వరరావు, జీవీఎన్ కృష్ణారావు, దాపర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

### అన్నవరప్పాడులో చీరల పంపిణీ



అన్నవరప్పాడులో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జన సైనికులు

పెరవలి: నిడదవోలు ఎమ్మెల్యేగా జనసేన పార్టీకి చెందిన కందుల దుర్గేష్ భారీ మెజార్టీతో గెలవడంతో పెరవలి మండలం అన్నవరప్పాడులో జన సైనికులు గురువారం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పప్పొప్పు సూర్య నాగేశ్వరరావు (పీఎస్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తమ పార్టీ తరపున కందుల దుర్గేష్ ఎమ్మెల్యేగా గెలిచినందున, నిడదవోలు నియోజకవర్గం ఏర్పడ్డాక తొలిసారిగా ఇక్కడి నుంచి గెలిచిన దుర్గేష్ మంత్రివర్గంలో స్థానం లభించినందుకు ఆనందంతో చీరలు పంపిణీ చేశామని నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జన సైనికులు బొలిశెట్టి ప్రసాద్, పులపర్తి తాతబ్బాయి, పంతం నాగరాజు ,టీడీపీ నాయకులు రంగినీడి కట్లయ్య, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

### 29న జాతీయ లోక్ అదాలత్

నిడదవోలు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు, రాజీయోగ్యమైన అన్ని రకాల కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

# అమ్మో.. జూన్ నెల

- ప్రైవేట్ స్కూళ్లలో పెరిగిన ఫీజుల భారం
- ఇక డొనేషన్లు, పుస్తకాల ధరలు అదనం
- విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం



తాళ్లపూడి మండలంలోని ఓ స్కూల్లో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన పుస్తకాలు



తాళ్లపూడిలో ఓ ఫ్యాన్సీ దుకాణంలో స్కూల్ బ్యాగ్‌ల విక్రయాలు

తాళ్లపూడి: చిరుద్యోగి అయిన సురేష్‌కు ఇద్దరు పిల్లలు. వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కాన్వెంట్‌లో చదివిస్తున్నాడు. ఒకరు ఐదు, మరొకరు ఏడో తరగతి. వారిద్దరి చదువుకు ఏడాదికి రూ.69 వేల వరకూ ఖర్చవుతుంది. నెలకు రూ.20 వేలు మాత్రమే సంపాదించే సురేష్‌కు పిల్లల చదువు భారంగా మారింది. అయినప్పటికీ ఇంగ్లిషు మీడియం చదువు మాన్పించలేక, ఏటా ఖర్చులు భరించలేక మదన పడుతున్నాడు. వేసవి సెలవుల అనంతరం జూన్‌లో స్కూళ్ల రీ ఓపెనింగ్ అంటే విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రాయి పడుతోంది. కాన్వెంట్ ఫీజు, బస్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాం వంటి వాటి కోసం రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.

**కాన్వెంట్‌లో చేర్పించాలంటే..**

నిత్యావసరాల ధరలు పెరిగిపోయి, బతుకు భారమైన ఈ రోజుల్లో తల్లిదండ్రులకు పిల్లల చదువులు తప్పని అదనపు భారం అయ్యాయి. మూడేళ్ల పిల్లోడిని కాన్వెంట్‌లో చేర్పించేందుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ ఖర్చవుతుంది. కొవ్వూరు నియోజకవర్గంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల మోత మోగుతోంది. డొనేషన్లు, అడ్మిషన్ ఫీజు, స్కూలు ఫీజు, యూనిఫాం, షూ, పుస్తకాలతో పాటు, బస్ ఫీజులు చెల్లించాలి. ఇక కార్పొరేట్ స్కూళ్లలో పిల్లల చదువంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. అవసరమైన సబ్జెక్టులు నాలుగే అయినప్పటికీ ఊహ తెలియని పిల్లాడికి కూడా డ్రాయింగ్, జీకే, గ్రామర్, హిందీ, సైన్స్ అంటూ రకరకాల పుస్తకాలు కొనిపిస్తున్నారు. విద్యార్థుల ఫీజులపై ప్రభుత్వం నిర్దిష్ట విధానాన్ని ప్రకటించి ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు వాటిని పాటించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**అప్పుచేసి మరీ..**

ప్రైవేట్, టెక్నో స్కూళ్ల మధ్య పోటీ తీవ్రంగా ఉంటోంది. ఈ క్రమంలో విద్యార్థులను ఆకర్షించేందుకు ఆయా స్కూళ్ల యాజమాన్యాలు భారీ ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో తమ పిల్లలను ఎక్కడ చదివించాలా? అనే సందిగ్ధం వారి తల్లిదండ్రుల్లో ఏర్పడుతోంది. పిల్లలను కాన్వెంట్‌లో చదివించాలనే ఆశతో ఖర్చుకు వెనుకాడకుండా, అప్పు చేసి మరీ వాటిని సమకూరుస్తున్నారు. ప్రైవేట్ స్కూళ్లల్లో ఒక్కో విద్యార్థికి అడ్మిషన్ ఫీజు రూ. 2 వేల నుంచి రూ.6 వేలు, జత యూనిఫాంకు రూ.1200 నుంచి రూ.1,600, పుస్తకాలు, స్టడీ మెటీరియల్, నోట్ బుక్స్‌కు రూ.2 వేల నుంచి రూ. 6 వేల వరకూ వసూలు చేస్తున్నారు. షూకు రూ.300, ఆటో చార్జీ నెలకు రూ. 500 నుంచి రూ.1200, బ్యాగ్‌కు రూ.200 నుంచి రూ.400, ఇతరత్రా స్టేషనరీ కలిపి రూ.500 మొత్తం రూ.8 వేల నుంచి రూ.16 వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని తల్లిదండ్రులు చెబుతున్నారు. కొన్ని కాన్వెంట్‌లలో బోధించే సిలబస్ ప్రైవేట్‌ది కావడంతో పుస్తకాల బడ్జెట్ మరింత మారుతోంది. ప్రభుత్వం నుంచి టెక్స్ట్ బుక్స్ కొనాలన్న నిబంధన ఈ ఏడాది అమలు కావడం లేదు. అదీగాక గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫీజులు ఎల్‌కేజీ స్థాయి నుంచి కూడా పెరిగాయి. ఈ ఫీజులను ఒకటి లేదా రెండు టర్మ్‌లుగా కాన్వెంట్ల యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయి. ఖర్చులు ఇంత ఘనంగా ఉన్నప్పటికీ కాన్వెంట్లు, ప్రైవేట్ స్కూళ్లలో పూర్తిస్థాయిలో వసతులు ఉంటాయా అంటే ప్రశ్నార్థకమే.



కాన్వెంట్ విద్యార్థులు

### ఫీజుల భారంతో తల్లిదండ్రుల బెంబేలు

తాళ్లపూడి మండలంలోని ప్రైవేట్ స్కూళ్లలో ఎల్‌కేజీ నుంచి ఐదో తరగతి వరకూ చదివే విద్యార్థుల నోట్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, ఆటో ఫీజులు, పాఠశాల ఫీజులు కలిపి రూ.28 వేల నుంచి రూ.34 వేల వరకూ ఖర్చవుతోంది. ఇక 6 నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకైతే ఈ ఖర్చు రెట్టింపు. ఇక్కడి నుంచి కొవ్వూరుకు బస్సు ఫీజు ఒక్కటే ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకూ వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు అదనపు వస్తువులు అవసరం అంటూ తల్లిదండ్రులపై మరింత భారం మోపుతున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలోని కొవ్వూరు, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో 40 వరకూ ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. వాటిలో సుమారు 9,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్క తాళ్లపూడి మండలంలోనే 2,500 మంది ఉన్నారు.

### నిబంధనలు విధిగా పాటించాలి



ఒకటి నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వం సమకూర్చే పాఠ్య పుస్తకాలనే మాత్రమే కొనుగోలు చేయాలి. అందుకనుగుణంగానే పరీక్షలు నిర్వహించాలి. అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు విధిగా పాటించాలి. ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తాం.

– సీహెచ్ బాలామణి, ఎంఈవో తాళ్లపూడి మండలం

## ఆదాయ వనరులపై దృష్టి పెట్టండి



హాజరైన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- సాదాసీదాగా నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: పురపాలక సంఘానికి వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయ వనరులపై అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆదేశించారు. నిడదవోలు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. అజెండాలో ప్రతిపాదించిన తొమ్మిది ఆంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వానికి, నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, రాష్ట్ర మంత్రిగా నియమితులైన కందుల దుర్గేష్‌కు అభినందనలు తెలిపారు. ఎంఏ అండ్ యూడీ ఆదేశాల మేరకు స్థానిక మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఐదుగురి పార్ట్‌టైమ్ స్వీపర్లకు కంటింజెంట్ చార్జీల కింద రూ.2.60 లక్షలను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పట్టణ పరిధిలో వారపు సంత, రోడ్ మార్జిన్, రోజువారీ మార్కెట్‌లో పన్నులు వసూలు చేసుకునే హక్కు కోసం మార్చిలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో రూ.8.25 లక్షలకు టెండర్ దక్కించుకున్న ఎ.కనకదుర్గాబాయికి వేలం హక్కు అప్పగించడానికి కౌన్సిల్ ఆమోదించింది. పట్టణ పరిధిలో గొర్రెలు, మేకలు వధించుట, పచ్చగడ్డి, కొబ్బరిచెట్లు, తాటిచెట్లు ఫలసాయం కోసం బహిరంగ వేలం నిర్వహించగా పాట దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు హక్కు ఇస్తూ కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

## మంత్రి దుర్గేష్‌కు కూటమి శ్రేణుల స్వాగతం

నిడదవోలు రూరల్: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు మండలంలోని విజ్జేశ్వరం గ్రామం వద్ద జనసేన పార్టీ శ్రేణులు గురువారం ఘన స్వాగతం పలికాయి. మంత్రి దుర్గేష్‌ను మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కూటమి నాయకులు పూలమాలలు వేసి అభినందించారు. విజ్జేశ్వరం నుంచి ర్యాలీగా బయలు దేరి గోపవరం గ్రామంలోని గుబ్బాలమ్మను దర్శించుకున్నారు. సమిశ్రగూడెం బ్రిడ్జి, నిడదవోలు పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ వారి ఆలయానికి దుర్గేష్ చేరుకున్నారు. మంత్రి దుర్గేష్‌కు ఆలయ చైర్మన్ దేవులపల్లి రవి, ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం దుర్గేష్‌ను అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద ఆశీర్వచనాలు అందించి అమ్మవారి చిత్రపటాన్ని మంత్రి దుర్గేష్‌కు అందించారు. కార్యక్రమాల్లో జనసేన, టీడీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు రంగా రమేష్, కొమ్మిన వెంకటేశ్వరరావు, పోలిరెడ్డి వెంకటరత్నం, వెలగన సూర్యారావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తిమ్మరాజుపాలెంలో మంత్రి దుర్గేష్‌కు కోటసత్తెమ్మ చిత్ర పటాన్ని బహూకరిస్తున్న ఆలయ చైర్మన్ రవి, అధికారులు

**పూజా గణపతి కుమార స్వామివార్ల ఆలయంలో..**

నిడదవోలు: ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం లభించడంతో పట్టణంలోని గణేష్ చౌక్ సెంటర్లోని శ్రీపూజా గణపతి కుమార స్వామివార్ల ఆలయంలో గురువారం ఆయనను ఘనంగా సత్కరించారు. టీడీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఆధ్వర్యంలో దుర్గేష్‌కు దుశ్శాలువా కప్పి, కిరీటం పెట్టి సత్కరించి అభిమాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణశాఖ అధ్యక్షుడు రంగా రమేష్, టీడీపీ పట్టణశాఖ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వర రావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, టీడీపీ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### పార్టీ అధినేత జగన్‌ను కలసిన అనసూయ



జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట ఆనసూయ, ఎమ్మెల్సీ పోతుల సునీత

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు ఆచంట అనసూయ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత కూడా ఉన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమిపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వారిద్దరూ చర్చించారు. జరిగిన దానిని మర్చిపోదామని, ప్రజల్లోకి వెళదామని, ధైర్యంగా ఉండాలని అధినేత వైఎస్ జగన్ తమకు సూచించినట్టు అనసూయ తెలిపారు.

## ఎమ్మెల్యే ముప్పిడిని కలసిన సచివాలయ ఉద్యోగులు

తాళ్లపూడి: కొవ్వూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ముప్పిడి వెంకటేశ్వరరావును తాళ్లపూడి మండల గ్రామ సచివాలయ ఉద్యోగులు గురువారం కొవ్వూరులో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నూతన ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఉన్నత పనితీరు కనబరుస్తూ, ప్రభుత్వానికి సహకరిస్తామని వారు తెలిపారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచీ ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని మండల సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.గణేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయ ఉద్యోగులు సీహెచ్ శ్రీనివాస్, ఆనంద్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

**అభినందనల వెల్లువ**

కొవ్వూరు: ఎమ్మెల్యేగా ఎన్నికైన ముప్పిడి వెంకటేశ్వరరావును బుధవారం సాయంత్రం వివిధ శాఖల అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు, స్వీట్లు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖ, సచివాలయాలు, మునిసిపాలిటీ సిబ్బంది, డ్వాకా సీఏలు ఎమ్మెల్యేను కలసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, నాయకులు పాట్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దొమ్మేరులో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. వీకే రంగారావు, ఎంపీటీసీ సభ్యులు యలమర్తి రాంబాబు, ఆళవు సరోజిని, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిసిన సచివాలయ ఉద్యోగులు

## పాఠశాలలకు స్టూడెంట్ కిట్లు

త్వరలోనే విద్యార్థులకు పంపిణీ



నల్లజర్ల మండలం దూబచర్ల హైస్కూల్‌కు చేరిన స్టూడెంట్ కిట్లతో ఎంఈఓ-2 భగవతి

నల్లజర్ల: పాఠశాలలకు వేసవి సెలవులు ముగిశాయి. గురువారం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు నల్లజర్ల ఎంఈఓ-2 భగవతి తెలిపారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు 42,778 పాఠ్యపుస్తకాలు, 53, 350 స్టూడెంట్ కిట్లు (పాఠ్యపుస్తకాలు, షూస్, బెల్ట్, నోట్ పుస్తకాలు, యూనిఫాం, టై) అందజేశారు. మండలంలో 9 హైస్కూళ్లు, 4 యూపీ, 46 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు గురువారం కిట్లు అందించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారీ స్కూళ్లు అభివృద్ధి చెందడంతో అడ్మిషన్లు గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. దూబచర్ల హైస్కూల్‌కు కిట్లు అందించే సమయంలో ఎంఈఓ-2 భగవతి, సీఆర్పీలు శ్రీను, పెదింట్లు, సుజాత, ఉపాధ్యాయుడు బొందల శ్రీనివాస్, పీఈటీ రాజారావు ఉన్నారు.

**తాళ్లపూడి మండలంలో..**

తాళ్లపూడి: మండలంలోని 32 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలతో పాటు, నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు, షూలతో కూడిన స్కూల్ కిట్‌లను త్వరలోనే అందజేస్తామని ఎంఈవో సీహెచ్ బాలామణి, ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ గురువారం తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకూ విద్యార్థులకు 5,077 పాఠ్య పుస్తకాలు, 6 నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులకు 18,145 పాఠ్య పుస్తకాలు, 22,166 నోట్ పుస్తకాలు, 3,075 స్కూల్‌బ్యాగ్‌లు, 3,148 షూలు, 6,296 సాక్స్, 2,063 బెల్ట్‌లు స్టూడెంట్ స్కూల్ కిట్‌లో భాగంగా మండలానికి వచ్చినట్టు తెలిపారు.

### పాఠశాలల పునఃప్రారంభం



తిరుగుడుమెట్ట ప్రాథమిక పాఠశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాళ్లపూడి: వేసవి సెలవులు ముగియడంతో మండలంలోని పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభమయ్యాయి. తొలి రోజు విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ నెల 20వ తేదీ వరకు వారం రోజుల పాటు పర్యావరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తిరుగుడుమెట్టతో సహా పలు ప్రాథమిక పాఠశాలల్లో ఆరోగ్య జాగ్రత్తలపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలలను శుభ్రం చేశారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

## శ్రీవారికి వెండి కిరీటం సమర్పించిన భక్తులు

దేవరపల్లి: స్థానికంగా కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి స్థానిక భక్తుడు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ చీఫ్ మేనేజర్ సింగులూరి సుధాకర్, రమాదేవి దంపతులు, వారి కుమారుడు శ్రీనివాస సత్య రామ్‌తేజ్‌లు గురువారం వెండి కిరీటాన్ని సమర్పించారు. 500 గ్రాముల వెండితో తయారు చేయించిన ఈ కిరీటానికి రూ.70 వేలు ఖర్చయినట్టు సుధాకర్ తెలిపారు. శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు సుమారు రూ.1.20 లక్షల వ్యయంతో రెండు వెండి కిరీటాలను కూడా త్వరలో సమర్పిస్తామని ఆయన తెలిపారు. ఆలయంలో కిరీటానికి గురువారం పూజలు నిర్వహించాక స్వామి వారికి అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు యాగంటి వెంకటేశ్వరరావు, గుడ్ల వెంకటేశ్వరరావు, బుల్లిరాజు, చిట్టు ప్రసాద్, కొండపల్లి సత్యనారాయణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి వారికి వెండి కిరీటం సమర్పిస్తున్న భక్తుడు సింగులూరి సుధాకర్, రమాదేవి దంపతులు

## ఆదమరిస్తే డ్రైన్‌లోకే..



తణుకు-ఉండ్రాజవరం రోడ్డులో పాలంగి గ్రామంలో రక్షణ గోడ లేని డ్రైన్

ఉండ్రాజవరం: తణుకు – ఉండ్రాజవరం మార్గంలో పాలంగి గ్రామం పరిధిలోని డ్రైన్‌కు ఒక పక్క రక్షణ గోడ లేదు. దీంతో ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయపడుతున్నారు. నిత్యం ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, లారీలు, బస్సులు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు డ్రైన్‌లో పడిపోయిన ఘటనలు గతంలో చాలా జరిగాయి. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని లోగడ ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా చర్యలు తీసుకోలేదని ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైన్‌పై రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

### 17 వరకూ లేపాక్షిలో థీమాటిక్ ఎగ్జిబిషన్

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): లేపాక్షి ఎంపోరియంలో గురువారం ప్రారంభమైన థీమాటిక్ ఎగ్జిబిషన్ ఈ నెల 17 వరకూ కొనసాగుతుందని లేపాక్షి నగర సంస్థ మేనేజర్ మోనిక తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం మాట్లాడుతూ థీమాటిక్ ఎగ్జిబిషన్‌కు అద్భుత స్పందన లభిస్తోందన్నారు.

## ఎంటీపీ యాక్ట్ జిల్లా కమిటీ సమావేశం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో ఎంటీపీ యాక్ట్ 1971 జిల్లా కమిటీ సమావేశం గురువారం జరిగింది. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ శిరీష, అనంతరావు, టి.పద్మజ మాట్లాడారు. సంతాన సాఫల్య కేంద్రానికి తప్పనిసరిగా ఎంటీపీ ధ్రువపత్రం ఉండాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అనుమతులు పొందిన ఆస్పత్రి నుంచి ప్రతి నెలా నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదిక తెప్పించి, దాని ఆధారంగా భ్రూణ హత్యలకు పాల్పడిన వారిని గుర్తించనున్నామన్నారు. జిల్లాలో ఎంటీపీ అనుమతికి వచ్చిన దరఖాస్తులను ఆయా ఆసుపత్రిలో సీనియర్ డివిజనల్ అధికారి ద్వారా స్థల పరిశీలన జరిపించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.హరిబాబు, డిప్యూటీ డీఈఎంవో సత్యకుమార్ నల్లూరి, ఎంపీహెచ్‌వో నాగు, సీసీ.రాజు, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.